# సింగిల్ పేజీ కథలు

## నిర్ణయం

అది హైదరాబాద్‌లో చంచల్‌గూడ జైలు. మహిళా ఖైదీలందరూ లైనులో నిల్చున్నారు, భోజనం కోసం అల్యూమినియం ప్లేట్లు చేత పట్టుకొని. కొత్తగా వచ్చిన మీనాక్షి ఏడుస్తోంది.

ఖైదీలను పర్యవేక్షించే కానిస్టేబుల్ నాగమ్మ అటువైపు వస్తూ "ఏయ్! ఎవరక్కడ ఏడ్చేది.. ఏడవకు!" అంది అధికార స్వరంతో.

మీనాక్షి స్వరం కొద్దిగా తగ్గించింది. నాగమ్మ ఆమె దగ్గరికొచ్చి "ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగింది, కొద్దిగా శాంతంగా.



మీనాక్షి మౌనంగా వుండిపోయింది. "నీ పేరేంటి?" అని అడిగింది నాగమ్మ.

"నా పేరు మీనాక్షి" చెప్పింది.

"నువ్వు నిన్నొచ్చిన కొత్త ఖైదీవా?" అనడిగింది నాగమ్మ.

"ఔను"

"ఏం నేరం చేశావేంటి?"

"నా కూతుర్ని అమ్ముకున్నాను. ఏడాది పాప" అంది మీనాక్షి, లోగొంతుతో.

"అరె.. పిల్లని అమ్ముకున్నావా! అంత కష్టం ఏమొచ్చింది?" అడిగింది నాగమ్మ కొంచెం ఆసక్తిగా.

"మా ఆయనకి జబ్బు చేసింది. ఏ పనికీ పోలేకపోతున్నాడు. పైసల్లేక దావఖానాకి తీసుకుపోలే. నాకు ఐదుగురు పిల్లలు.." ఏడుపుగొంతుతో చెప్పింది మీనాక్షి.

"కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేకపోయావా?" అడిగింది నాగమ్మ కొద్దిగా జాలిగా.

"నేను చాలాసార్లు అడిగాను ఆపరేషన్ చేయించమని. మా ఆయన కోప్పడేవాడు. కొట్టబోయేవాడు.."

"ఈ రోజుల్లో ఎవరమ్మా ఐదుగుర్ని కనేది, మీ మూర్ఖత్వంగానీ. నీ పిల్లలందరూ చిన్నవాళ్లేనా?"

"పెద్దమ్మాయికి పన్నెండేళ్లు. పెద్దింటోళ్ల ఇళ్లకి పనికి పోతాది. రెండోపిల్ల అవిటిది. తక్కిన పిల్లలు నావెంటే వుంటారు."

"సొంతిల్లు లేదా?"

"లేదు, గుడిసెల్లో కిరాయికుంటాం."

"తినడానికి తిండిలేక ఒకోరోజు సెంటర్లలో అడుక్కుంటా. ఒకరోజు ఓ పెద్దాయన నాకు పైసలు ధర్మం చేసి, అడుక్కునేవాళ్లని పోలీసులు పట్టుకుపోతున్నారు జాగ్రత్తని చెప్పిండు. నాకు భయమేసింది. ఎందుకు పట్టుకెళతన్నారని అడిగాను. అమెరికా నుంచీ ఎవరో పెద్దమంత్రిగారు వస్తున్నారంట. ఆయన మీ దేశంలో అడుక్కునే వాళ్లున్నారా అని ఆయన ఎగతాళి చేస్తారని అన్నాడు ఆ పెద్దాయన. ఒళ్ళో వున్న పిల్లని నాకియ్యి రెండు వేలిస్తానన్నాడాయన. నాకూ ఆశ పుట్టింది, మా ఆయన రోగం నయం చేసుకోవచ్చని. పిల్లనాయనకిచ్చి రెండువేలు తీసుకున్నాను. ఆయన పిల్లని తీసుకుని వెళ్లిపోయాడు. నేను మిగతా పిల్లల్ని తీసుకుని ఇంటికెళ్లిపోయాను. ఈ విషయం మా ఆయనకి చెప్పాను. ఆయన కోపంతో మండిపడ్డాడు. నన్ను కొట్టాడు. పెద్ద పెద్దగా కేకలేశాడు. జనం పోగయ్యారు. ఈ విషయం ఎవరో పోలీసులకి తెలియజేశారు. పోలీసులొచ్చి నన్ను స్టేషనుకి తీసుకుపోయారు" అని చెప్పింది మీనాక్షి.

నాగమ్మ మౌనంగా వింటోంది. మీనాక్షి మళ్లీ చెప్పింది. "నేను జైలు నుంచి బయటికెళ్లింతర్వాత- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తేనే నీ దగ్గరుంటా లేకపోతే నీకు విడాకులిచ్చి నా పిల్లల్ని తీసుకుని నా దారిన నే పోతానని మా ఆయనకి చెప్పాలని నిర్ణయించుకున్నాను."

"కనీసం ఇప్పుడైనా చాలా మంచి నిర్ణయం తీసుకున్నావ్" అంటూ మీనాక్షి భుజం తట్టి, అక్కడినుంచి కదిలింది కానిస్టేబుల్ నాగమ్మ.

-కొండా రామారావు (హైదరాబాద్)

***

"సీతమ్మా! నీకు ఉత్తరం వచ్చింది" అన్న పోస్ట్‌మేన్ కేకతో గుడిసె నుండి బయటకు వచ్చింది సీతమ్మ. పోస్ట్‌మేన్ ఉత్తరం చేతికందిస్తే "నాయనా! నువ్వే కాస్త చదివిపెట్టు" అంటూ బ్రతిమాలింది. పోస్ట్‌మేన్ కవరు చింపి ఉత్తరం చదివి "సీతమ్మా! మిలటరీలో ఉద్యోగం చేస్తున్న నీ కొడుకు సింహాచలం మరో పది రోజులలో ఇక్కడకి వస్తున్నా"డనే తీపి కబురు చదివి వినిపించి వెళ్ళిపోయాడు.

ఇంకా పది రోజులలో కొడుకు వస్తాడనే శుభవార్త సీతమ్మకు చాలా సంతోషాన్నిచ్చింది. ఈసారి ఎలా అయినా కొడుకును ఒప్పించి మంచి అమ్మాయిని చూసి, పెళ్ళి చేసే

యాలని నిశ్చయించుకొంది.

సీతమ్మకి ఇద్దరు కొడుకులు. వారి చిన్నతనంలోనే భర్త ప్రమాదవశాత్తు మరణించడంతో వారిద్దరికి అన్నీ తానే అయ్యి రాత్రనకా, పగలనకా, ఎండనకా, వాననకా కూలిపనులు చేస్తూ ఇద్దరినీ ఇంటర్మీడియట్ వరకూ కష్టపడి చదివించింది. ఇద్దరు కొడుకులు కూడా చక్కగా చదివి మంచి మార్కులతోనే పాసయ్యారు. అందులో పెద్దవాడే సింహాచలం. తల్లి తమ చదువుకోసం పడుతున్న కష్టాన్ని గుర్తెరిగి ఆర్మీ సెలక్షన్స్‌కి వెళ్ళి తన ప్రతిభతో ఆర్మీలో సైనికుడిగా ఎంపిక అయ్యాడు. ఏడాది క్రితమే ఆర్మీ శిక్షణ పూర్తి చేసుకొని కాశ్మీర్ సరిహద్దులో పోస్టింగ్ పొందాడు.

ఇక చిన్నవాడు భూషణం. డిగ్రీ ప్రయివేటుగా చదువుతున్నాడు. సీతమ్మకి ఇంటి పనులలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. డిగ్రీ పరీక్షలు వారంరోజులుగా ప్రక్కనే ఉన్న

## దేశభక్తి

టౌన్‌లో మిత్రుని గదిలో వుంటూ రాస్తున్నాడు.

సింహాచలం కాశ్మీర్ సరిహద్దులో జాయిన్ అయిన తర్వాత మొదటిసారిగా తన గ్రామానికి ఇప్పుడే వస్తున్నాడు.

టౌన్ నుంచి ఆ సాయంకాలమే భూషణం ఇంటికి వచ్చాడు. "ఒరేయ్! అన్నయ్య మరో పది రోజులలో ఇంటికి వస్తున్నాడ"ని తల్లి చెప్పడంతో చాలా ఆనందపడ్డాడు.

భూషణం కూడా ఈమధ్యకాలంలో ఆర్మీ సెలక్షన్స్‌కి వెళుతూనే ఉన్నాడు.

సీతమ్మ కొడుకు రాకకోసం, భూషణం అన్నయ్య రాక కోసం ఎప్పుడు పదిరోజులు అవుతాయా అనుకొంటూ, ఆనందంగా, ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

ఇంతలోనే వాళ్ళకి పిడుగులాంటి వార్త అందింది. కాశ్మీర్ సరిహద్దులలో సైనికులపై తీవ్రవాదులు జరిపిన దాడిలో వారితో పోరాడుతూ నలుగురు తీవ్రవాదులను మట్టుబెట్టి సింహాచలం మరణించాడని, రెండు రోజుల్లో సింహాచలం భౌతికకాయం ఆ గ్రామానికి వస్తుందని, ఆ గ్రామానికి చేరువలో ఉన్న పోలీస్‌స్టేషన్ సిబ్బంది సమాచారం అందించారు.

సీతమ్మ, కొడుకు మరణవార్త వినడంతోనే కుప్పకూలిపోయింది. భూషణం భోరుమని చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు. ఈ వార్త తెలిసిన బంధువులు, గ్రామప్రజలు సీతమ్మ ఇంటికి చేరుకొని సీతమ్మను, భూషణాన్ని ఓదార్చడానికి ప్రయత్నించారు. వారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

గ్రామానికి రెండు రోజుల తర్వాత సింహాచలం భౌతికకాయం చేరింది. చుట్టుప్రక్కల గ్రామాల రాజకీయ నాయకులు, అధికారులు వచ్చి అధికార లాంఛనాలతో సింహాచలానికి అంత్యక్రియలు జరిపారు. "సింహాచలం అమర్ రహే" అంటూ స్థానిక ఎమ్మెల్యే, స్థానిక సర్పంచ్, ఇంకా చోటా రాజకీయ నాయకులు 'సింహాచలం సంస్మరణ సభ' జరిపి దేశరక్షణ కోసం తీవ్రవాదులను మట్టుబెట్టి తన ప్రాణాలు కోల్పోయిన సింహాచలం గూర్చి, తీవ్రవాద సమస్య గూర్చి తమకు తెలిసినది, తెలియనది కలగలిపి ఆవేశంగా మాట్లాడేశారు. "సింహాచలం మన గ్రామంలో పుట్టినందుకు గర్వపడాల"ని స్థానిక సర్పంచ్ ఆవేశంగా మాట్లాడేశాడు. తర్వాత సమావేశాన్ని చాలించి సింహాచలాన్ని పూర్తిగా మరచిపోయారు.



సీతమ్మ మాత్రం తన కొడుకు తీవ్రవాదుల దాడిలో మరణించాడనే విషయాన్ని జీర్ణించుకోలేక నిద్రాహారాలు మాని మౌనంగా రోదిస్తూనే ఉంది.

సింహాచలం మరణించి రెండు నెలలు గడిచాయి. ఆ గాయం నుండి సీతమ్మ ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నది. ఇంతలోనే అంతకు ముందు వెళ్ళిన ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో భూషణం సెలక్టయినట్టు, ట్రైనింగ్‌కి వారం రోజుల్లో హాజరవ్వాలంటూ భూషణానికి ఆర్మీ సెలక్షన్ ఆర్డర్ వచ్చింది.

భూషణం ఆ విషయాన్ని తల్లికి చెప్పి, నిరాసక్తంగా ఆ ఆర్డర్ కాపీని తల్లి ప్రక్కనే పడేసి తనకు వెళ్ళడం ఇష్టంలేనట్లుగా బయటకు వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి భోజనం చేస్తున్న భూషణంతో "నాయనా! నీవు తప్పనిసరిగా వారం రోజుల్లో ట్రైనింగ్‌కి బయలుదేరి వెళ్ళు" అని సీతమ్మ చెప్పింది. దానికి జవాబుగా భూషణం "అమ్మా! అన్నయ్యకి జరిగినది తెలిసి కూడా నన్ను వెళ్ళమంటున్నావేమిటి?" అని అడగడంతో-

"నాయనా! ఒక తల్లిగా నేను కేవలం నా ఒక్క బిడ్డనే కోల్పోయాను. కానీ తీవ్రవాదుల హింసాత్మక చర్యల వలన మన భారత మాత అనేకమంది బిడ్డలను కోల్పోతూ, యిక్కట్లకు గురి అవుతున్నది. అటువంటి తీవ్రవాదాన్ని తరిమివేయాలంటే నీవంటి సైనికులు అవసరం" అని కొడుక్కి వివరించి-

"మీ అన్నయ్య భారత మాత రక్షణకై తన ప్రాణాలు విడిచిపెట్టాడు. మీ అన్నయ్య విడిచిపెట్టిన బాధ్యతను నీవు స్వీకరించి ఈ భారతమాతను రక్షించు నాయనా!" అని కొడుకుకి చెప్పి వెంటనే బయలుదేరమని ఒప్పించింది.

భూషణం ఆర్మీకి ఎంపికయ్యాడని, సీతమ్మ కొడుకుని ఒప్పించి ఆర్మీట్రైనింగ్‌కి పంపుతున్నాదని తెలిసిన బంధువులు, చుట్టుపక్కల వారు రెండు నెలల క్రితమే ఆర్మీలో ప్రాణాలు కోల్పోయిన నీ పెద్దకొడుకు గురించి తెలిసి కూడా, నీ రెండో కొడుకుని పంపడం బాగోలేదని నిర్ణయం మార్చుకోమని సీతమ్మకి చెప్పారు.

వాళ్ళందరికీ సమాధానంగా సీతమ్మ "నాకు నా కొడుకుపైన మమకారంకన్నా, భారతమాతను అనునిత్యం వేదనకు గురిచేస్తున్న తీవ్రవాదులను మట్టుపెట్టడంపైనే మమకారమని" చెప్పి తన దేశభక్తి వారికి అర్థమయ్యేలా ఘాటుగా సమాధానమిచ్చింది.

ఆ సమాధానంతో వారంతా సీతమ్మకి తమ మనసుల్లోనే వందనాలు సమర్పించారు. ఆ మాటలు విన్న భూషణం ఆనందంగా దేశమాత సేవకోసం బయలుదేరడానికి సిద్ధమయ్యాడు.

-మొర్రి గోపి (కవిటి)